
# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక




**June 1994**

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" అను రేడియో కార్యక్రమములద్వారా, మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకము మావద్ద కలవు. మీరు కేవలము రూ. **25/-** లు ఈ క్రింది అడ్రసుకు **M.O.** చేసినచో రూ. **100-00** లకు మించిన విలువగల **15** నుండి **20** రకముల పుస్తకములు, మరియు రెండు సంవత్సరముల వరకు "సత్యవాక్కు" అను మాసపత్రిక మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంధాలయము తెరవండి. మావద్ద లభించు పుస్తకముల రేట్ల వివరములు పోస్టేజీతో సహా

| | | |
|---|---|---|
| 1. | పెద్ద బైబిలు | రూ. 45-00 |
| 2. | పెద్ద అచ్చు బైబిలు | 110-00 |
| 3. | రిఫరెన్సు బైబిలు | 75-00 |
| 4. | 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు రెండు సంవత్సరముల పాటు సత్యవాక్కు మాస పత్రిక ఉచితం. | రూ. 25-00 |

గమనిక : మీరు పంపు పైకము **M.O.** ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ రాయండి.

**SATYA VANI**
Sambamurthi St., Ramaraopeta,
KAKINADA - 533 004.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 14    జూన్ 1994    సంచిక 11

## సంపాదకీయము

### "నీవు చదువునది గ్రహించుచున్నావా?"

### ("Understandest Thou What Thou Readest")

అపొస్తలుల కార్యములు 8వ అధ్యాయములో నపుంసకుడు మార్పు చెందిన సందర్భము నీకు జ్ఞాపకమున్నదా? ప్రభువు దూత ఫిలిప్పుతో నీవు దక్షిణముగా వెళ్ళి యెరూషలేమునుండి గాజాకు పోవు యెడారి మార్గమును కలిసికొమ్మని చెప్పెను. ఆ మార్గములో ఐతియోపీయుల రాణియైన కందాకేక్రింద ఆర్థిక మంత్రియైన నపుంసకుడు ఆరాధించుటకు యెరూషలేముకు వచ్చి తన రథముమీద తిరిగి వెళ్ళుచుండెను. అతడు యూదా మత ప్రవిష్టుడు, భక్తిగలవాడు. అతడు రథములో యెషయా ప్రవక్త గ్రంథమును చదువుచుండెను. "అప్పుడు ఆత్మ ఫిలిప్పుతో - నీవు రథము దగ్గరకు పోయి దానిని కలసి

కొనుమని" చెప్పెను. ఫిలిప్పు దగ్గరకు పరుగెత్తుకొని పోయి అతడు పరిశుద్ధుడైన యెషయా గ్రంథము చదువుచుండగా విని - నీవు చదువునది గ్రహించుచున్నావా? అని అడుగగా, అతడు ఎవడైనను నాకు త్రోవ చూపకుంటే ఏలాగు గ్రహింపగలనని చెప్పి రథమెక్కి తనతో కూర్చుండుమని ఫిలిప్పును వేడుకొనెను" (అపొ. కా. 8:29-31).

ఫిలిప్పు రథములోనికి వెళ్ళి అతడు చదువుచున్న లేఖనమును అనుసరించి అతనికి యేసునుగూర్చిన సువార్త ప్రకటించెను. దాని ఫలితమేమంటే వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్ళున్న యొక చోటికి వచ్చినప్పుడు నపుంసకుడు ఇదిగో నీళ్ళు, నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. నీవు యేసుక్రీస్తు దేవుని కుమారుడని పూర్ణహృదయముతో విశ్వసించిన యెడల పొందవచ్చునని ఫిలిప్పు అతనితో చెప్పగా అతడు క్రీస్తునందలి విశ్వాసము నొప్పుకొనెను. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరు నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను. వారు నీళ్ళలోనుండి వెడలి వచ్చినప్పుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను. నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను. అతడు ఫిలిప్పును మరి యెన్నడును చూడలేదు.

నపుంసకుడు లేఖనములను చదువుచున్నను నీవు చదువునది గ్రహించుచున్నావా ? యని ఫిలిప్పు అతని ప్రశ్నించినట్లు గమనించుము. అంటే ఒకడు లేఖనములను చదువుచున్నంత మాత్రాన దాన్ని గ్రహించుకొనుచున్నాడని అర్థము కాదు. అతడు లేఖనములను అర్థము చేసికొనలేడని కాదు, గాని ఒకనికి అసత్యము బోధింపబడితే, సత్యానికి విరుద్ధంగా అతడు దురభిమాన ద్వేషము గలవాడై యుండి దాన్ని గ్రహించుకోలేక పోవచ్చును. ఒకడు లేఖనాలను అర్థము చేసికోక పోవడానికి ఇంకా కొన్ని కారణాలుండవచ్చును.

గాని నపుంసకుడు ఫిలిప్పును సహాయము చేయుమని అడిగాడు, అతడా సహాయాన్ని యిచ్చాడు.

దేవుడు మనతో మాట్లాడెను (హెబ్రీ 1:1, 2). తన చిత్తాన్ని తన గ్రంథములో బయలు పరచెను (యోహాను 17 : 17; మత్తయి 7 : 21). మనము ఆయన వాక్యమును చదివి గ్రహించుకోవాలని ఆయన కోరుచున్నాడు (2 తిమో 2 : 15). అంతేకాదు ఆయన చిత్తానికి మనం లోబడాలని ఆయన కోరుచున్నాడు (యాకోబు 1:22). మనం ఆయన చిత్తాన్ని ఎరుగకపోతే, అర్థం చేసుకోకపోతే, ఆయన కెట్లు లోబడుదుము ?

సర్వలోకానికి సువార్త ప్రకటించబడాలని క్రీస్తు ఆజ్ఞాపించాడు (మార్కు 16 : 15, 16; మత్తయి 28 : 19, 20). ఎందువలన ? క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానములు ప్రజలకు తెలియజేయబడాలి. ప్రజలకు సువార్త ఆజ్ఞలు వినిపింపజేయబడాలి, వారు ప్రభువునందు విశ్వసించాలి, ఆయనకు లోబడి రక్షింపబడాలి.

క్రీస్తు ఎవరో ఒకనికి తెలియకపోతే అతడు క్రీస్తునందు ఎట్లు విశ్వసిస్తాడు ? దేవుని వాక్యమును వినుట (గ్రహించుకొనుట) వలన విశ్వాసము కలుగునని పౌలు చెబుతున్నాడు (రోమా 10 : 17). మారుమనస్సులో ఏమి యిమిడి యున్నదో ఒకనికి తెలియకపోతే అతడెట్లు మారుమనస్సు పొందగలడు ? "దొంగిలువాడు ఇక మీదట దొంగిలక అక్కరగలవానికి పంచిపెట్టుటకు వీలుకలుగు నిమిత్తము తన చేతులతో మంచిపని చేయుచు కష్టపడవలెనని" అపో.పౌలు చెప్పాడు (ఎఫెసి 4:28). ఒకడు తన పాపములన్నిటి విషయము మారుమనస్సు నొందవలెను. ఒకడు క్రీస్తు ఎవరో ఎరుగకపోతే ఆయనను ఎట్లు ఒప్పుకొంటాడు ? (రోమా 10 : 10; మత్తయి 10:32, 33). ఒకనికి బాప్తిస్మమంటే యేమిటో తెలియకపోతే అతడు లేఖనముల ప్రకారము

పాపక్షమాపణ నిమిత్తము యెట్లు బాప్తిస్మము పొందుతాడు? (రోమా 6 : 3, 4; అపొ. కా. 2 : 38). అంతేకాదు. ఒకడు క్రీస్తు సంఘాన్ని గూర్చి ఎరుగకపోతే దానిలో సభ్యుడెట్లు కాగలడు? (మత్త 16:18; ఎఫెసీ 5:23; 1 కొరింథీ 12:13).

బాప్తిస్మమనగా యేమిటో, దాని ప్రయోజన మేమిటో తెలిసికోకుండానే బాప్తిస్మము పొంది, తరువాత తాను లేఖనముల ప్రకారము బాప్తిస్మము పొందలేదని గ్రహించుట సాధ్యమా? ఒకడు వ్యభిచారమును గూర్చి, దొంగతనమునుగూర్చి, అట్టి మొదలగు పాపములను గూర్చి మారుమనస్సు పొందకుండగనే లేఖనముల ప్రకారము బాప్తిస్మము పొందవచ్చునా? ఒకడు మతశాఖల సంఘములో సభ్యుడై యుండి క్రీస్తు సంఘములోనే యున్నానని భావించవచ్చునా? ఆరాధనను గూర్చి బైబిలు బోధించుదానిని ఎరుగకుండగనే దేవుని కిష్టపూర్వకమైన ఆరాధన చేయగలడా?

ఇటువంటి విషయాల్లో దేవుడు మానవుని అజ్ఞానమును చూచీ చూడనట్టుగా యుంటాడా? దాన్ని సహిస్తాడా? అట్లయితే ఆయన చిత్తాన్ని మనం తెలిసికొనగల్గునట్లు ఆయన గ్రంథాన్ని మనకెందుకు యిచ్చాడు? ఆయన వాక్యాన్ని మనం బోధించవలసిన పనియేమి?

అయితే తెలియకుండగనే, అకస్మాత్తుగా ఒకడు సువార్తకు లోబడిపోయి క్రీస్తు సంఘ సభ్యుడు కాలేడు. ఆలాగే మారు మనస్సు పొందకుండగనే, రక్షింపబడిపోయి క్రీస్తు సంఘములో ఒకడు చేర్చబడలేదు. మనం ఆయన గ్రంథాన్ని చదివి గ్రహించు కొనునట్లును, దాని ప్రకారము నడుచుకొనునట్లును దాన్ని మన కిచ్చాడు. యిది తప్ప వేరొక మార్గము మనకు లేదు.

— o —

కొండమీద ప్రసంగము - 4

# నీతికొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు

**(Blessed are they that Hunger and Thirst after Righteousness)**

(మత్తయి 5 : 6)

యేసు ప్రభువు చేసిన కొండమీద ప్రసంగములో మొదట ఆత్మ విషయమై దీనులైన వారిని గూర్చి చెప్పారు. తరువాత ఆ దీనత్వ మును గూర్చి దుఃఖించు వారిని గూర్చి ఆయన చెప్పారు. ఆ తరు వాత వారికి చేయు ఉపదేశమునుగాని, ఇచ్చు శిక్షణనుగాని సాత్వి కముతో అంగీకరించు వారిని గూర్చి ఆయన చెప్పారు. అటుతరువాత దేవునితో సత్సంబంధము కలిగియుండుటకు తహతహ లాడువారిని గూర్చి ఆయన చెప్పారు. "నీతికొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు; వారు తృప్తిపరచబడుదురు" అని ఆయన చెప్పారు. ఇట్టి వారు దేవునితో మొదట సరియైన సంబంధమును కలిగినవారు కాదు గాని ఆయనను తెలిసికొని ఆయన తత్వాన్ని నిజంగా కాంక్షించే వారు. అట్టివారు తృప్తి పరచబడుదురు. భోజనం లేక ఆకలితో అలమ టించుచు ఆహారము కొరకు తీవ్రముగా కాంక్షించువానివలె మనం దేవుని నీతిని కాంక్షించాలి. మానవుని ఆత్మ ఒకే ఒక్క నీతికొరకు, దేవుని నీతికొరకు ఆకలి దప్పులు కలిగి యుండాలి.

## దేవుని ఆహ్వానము

యెహోవా దేవుడు ఇట్లనుచున్నాడు: "దప్పిగొనిన వారలారా, నీళ్ల యొద్దకురండి, రూకలులేని వారలారా, మీరు వచ్చికొని భోజ నము చేయుడి. రండి, రూకలు లేకపోయినను ఏమియు నియ్యకయే ద్రాక్షారసమును పాలను కొనుడి. ఆహారము కాని దాని కొరకు మీరేల రూకలిచ్చెదరు ? సంతుష్టికలుగజేయని దానికొరకు మీ కష్టార్జితము ఎందుకు వ్యయపరచెదరు ? నామాట జాగ్రత్తగా ఆల

కించి మంచి పదార్థము భుజించుడి. మీ ప్రాణము సారమైన దాని యందు సుఖింపనియ్యుడి" (యెషయా 55 : 1, 2). "నీతికొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు, వారు తృప్తిపరచబడుదురు."

## నీతి అనగా యేమిటి ?

నీతి అనగా యేమిటి ? క్రీస్తువారు చెప్పిన ఈ ధన్యతలో నీతి అనునది ఒక ప్రాముఖ్యమైన మాటయై యున్నది. నీతికొరకు ఆకలి దప్పులు కలిగియుండుట అంటే దేవుని యొక్క పరిపూర్ణ నీతిని కాంక్షించుట, దేవుని చిత్తాన్ని తెలిసికొని దానికి విధేయత చూపించి దేవుని సంతోష పెట్టుటకు కాంక్షించుట యని మనం చెప్పవచ్చును. "మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు" అని మత్తయి 5 : 48 లో యేసు ప్రభువు చెప్పారు. మరల "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" అని యోహాను 14 : 15 లో ఆయన చెప్పారు. ఈ విషయంలో యేసుప్రభువు ఒక పరిపూర్ణ మాదిరిని మన కొరకు నెలకొల్పారు. "నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పని తుద ముట్టించుటయు నాకు ఆహారమై యున్నది" యని ఆయన ప్రకటించారు (యోహాను 5 : 34). శరీర సంబంధమైన ఆకలి తీర్చు కొనుట కంటే దేవుని చిత్తమును నెరవేర్చుట వలన క్రీస్తులోయున్న ప్రగాఢమైన ఆత్మీయ కాంక్ష సంతృప్తి చేయబడింది.

తనలోయున్న ఆత్మీయ ఆకలిని దావీదు మహారాజు ప్రార్థన పూర్వకంగా ఇట్లు విన్నవించాడు: "దేవా నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము. నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలిసికొనుము. నీకాయాసకరమైన మార్గము నా యందున్నదేమో చూడుము. నిత్యమార్గమున నన్ను నడిపింపుము" (కీర్తన 139 : 23, 24). నీతికొరకు ఆకలి దప్పులు గలవారిని గూర్చి క్రీస్తు చెప్పినట్లే

దావీదుకూడ అట్టి వానిని మొదటి దావీదు కీర్తనలో ఇట్లు వర్ణించాడు. "దుష్టుల ఆలోచన చొప్పున నడువక పాపుల మార్గమున నిలువక, అపహాసకులు కూర్చుండు చోటున కూర్చొనక యెహోవా ధర్మ శాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు. అతడు నీటి కాలువల యోరను నాటబడినదై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుండును. అతడు చేయున దంతయు సఫలమగును" (కీర్తన 1:1, 2).

## రెండు సహజ కోరికలు

యేసుప్రభువు మానవునికున్న ప్రముఖమైన, తీవ్రమైన, బల మైన సహజమైన రెండు అవసరతలనుగూర్చి చెప్పారు. ఆయన ఆకలి దప్పులను గూర్చి చెప్పారు. ఈ రెండు అవసరాలు మానవ జన్మతో ఆరంభమై మరణంతో అంతమౌతాయి. భౌతికంగా మనం పెరగాలంటే ఆహారం భుజించడం అవసరం. మన ఆకలి చచ్చిపోతే, లేక తగ్గిపోతే శరీరంలో ఏదో ఒక లోపం ఉన్నదని మనం గ్రహిస్తాము. ఆకలికంటే దప్పిక మరింత బలమైన, శక్తివంతమైన అవుసరతయై యున్నది. సిలువ వేయబడిన వానికి భరింపరానంత దాహం వేస్తుంది. అందుకే యేసుప్రభువు సిలువ మీద వ్రేలాడుచు "నేను దప్పిగొను చున్నాను" అని కేకవేసి చెప్పారు (యోహాను 19:28).

మత్తు పానీయాలను గూర్చి, పుగాకును గూర్చి, తదితర మత్తు పదార్థములను గూర్చి కొందరికి బలమైన కోరికలుంటాయి. అయితే యివి ప్రకృతి సహజమైనవి కావు. ఆహారమును గూర్చిన ఆకలి, నీళ్ళను గూర్చిన దప్పికవలె ఈ కోరికలు సహజమైనవి కావు. అయితే శరీర సంబంధమైన ఆకలి దప్పులకు, ఆత్మీయ సంబంధమైన ఆకలి దప్పులకు వ్యత్యాసమున్నది. కొన్ని సందర్భాల్లో ఆత్మీయాకలి అణచివేయబడతాది. విత్తువాని ఉపమానములో యేసు ముండ్ల

పొదలనడుమ పడిన విత్తనాన్ని గూర్చి చెప్పారు. "ముండ్ల పొదలలో పడిన విత్తనమును పోలిన వారెవరనగా (దేవుని వాక్యమును) విని కాలము గడచిన కొలది యీ జీవసంబంధమైన విచారముల చేతను ధన భోగముల చేతను అణచివేయబడి పరిపక్వముగా ఫలింపని వారు" అని ఆయన చెప్పారు (లూకా 8:14). పరిశుద్ధాత్మను మానవుడు ఎదురాడవచ్చును, దుఃఖింపజేయవచ్చును, చివరిగా ఆర్పివేయవచ్చును (1 థెస్స 5:19). ఇంకా, మనం ఊపిరి పీల్చుకొనుట ఎంత సహజమో, ఆకలి దప్పులు కలిగి యుండుట అంత సహజం. అయితే నీతి కొరకు ఆకలి దప్పులు విషయంలో అట్లు కాదు. క్రైస్తవులు బైబిలు చదివే అలవాటు కోల్పోతారు. ప్రార్థించుటలో వెనుకబడతారు. ఆరాధనకు గైరుహాజరవుతారు, దుర్భాషలాడతారు, ఆత్మీయ విషయాలను గూర్చిన ఉన్నత తలంపులను తలంచరు. వారి ఆత్మీయాకలి దప్పులు కృశించిపోతాయి.

## ఆత్మీయ బలహీనత

అంతేగాకుండ చాల మంది క్రైస్తవులు ఆత్మీయాహారము లేక శుష్కించి పోవుచున్నారు. అట్టి బలహీనతను కలిగి యున్నారని వారెరుగరు. దేవుని వాక్యము ఉచితముగా లభించుచున్నను దానిని గైకొననివారు, దానిలోని జీవజలములను పానము చేయనివారు నీతి కొరకు ఆకలి దప్పులు గలవారుకారు. వారు బలహీనులు. మరొక విధంగా చూస్తే ఈ లోక విషయాల్లో సమృద్ధి కలిగిన వారు నీతి కొరకు ఆకలి దప్పులు కలిగి యుండుట కష్టము. అందుకే ధనవంతుడు దేవుని రాజ్యములో ప్రవేశించుటకంటె ఒంటె సూది బెజ్జములో దూరుట సులభమని యేసు ప్రభువు చెప్పారు (మత్త 19:24).

ఇప్పుడు మనం వేసుకోవలసిన ప్రశ్న యేమంటే నీతికొరకు మొదట కలిగియున్న ఆకలి దప్పులను కోల్పోతే యేమి చేయాలి?

దానిని తిరిగి పొందుట ఎట్లు ? క్రైస్తవుడవైన మొదటిలో కలిగిన తృష్ణను తిరిగి పొందుటకు యేమి చేయాలి ? బహుశ నీ కుటుంబ వ్యవహారాలు నీలోయున్న ఆత్మీయాకలిని అణచివేయుచున్నవేమో. నీ ఉద్యోగరీత్యా యున్న సమస్యలు, నీ బిడ్డలు వగయిరాల వలన, లేక లోకసంబంధమైన ఆశల వలన నీలో విత్తబడిన వాక్యము అణచి వేయబడుచున్నదేమో. అట్లయినప్పుడు యేమిచేయాలి ? నిజానికి చూస్తే ఇట్టి పరిస్థితి యేమీ క్రొత్తది కాదు.

ఎఫెసులోయున్న క్రీస్తు సంఘము మొదటి శతాబ్దములో యిదే పరిస్థితిలో యుండెను. ప్రకటన గ్రంథములో ఆసియాలోని ఏడు సంఘములకు ఒక్కొక్క వర్తమానము పంపబడెను. యేసుప్రభువు ఈ వర్తమానమును పంపెను. ఎఫెసులోని సంఘములో యున్న మంచిని గూర్చి ప్రభువు హర్షించినను, తరువాత ఆయన యిట్లు చెప్పారు. "అయినను మొదట నీ కుండిన ప్రేమను నీవు వదిలితివని నేను నీమీద తప్పు ఒకటి మోపవలసి యున్నది. నీవు ఏస్థితిలో నుండి పడితివో అది జ్ఞాపకము చేసికొని మారుమనస్సు పొంది ఆ మొదటి క్రియలను చేయుము. అట్లు చేసి నీవు మారుమనస్సు పొందితేనేసరి; లేనియెడల నేను నీ యొద్దకువచ్చి నీ దీప స్థంభమును దాని చోటునుండి తీసివేతును" (ప్రక 4 : 5). ఏకారణమువలననో గాని ఎఫెసులోని క్రైస్తవులు తమ మొదటి ప్రేమను కోల్పోయారు. నీతి కొరకు వారికున్న ఆకలి దప్పులు చచ్చిపోయాయి. "మొదట నీకుండిన ప్రేమను నీవు వదిలితివని" ప్రభువు ఆ సంఘముపై తప్పు మోపారు. వారి పరిస్థితి సరిజేయబడాలంటే యేమి చేయాలి? "నీవు ఏస్థితిలోనుండి పడితివో అది జ్ఞాపకము చేసికొని మారుమనస్సు పొంది ఆ మొదటి క్రియలను చేయుము". గనుక మిత్రుడా, ఆత్మీయ విషయాల్లో మొదట నీకుండిన ఆకలిదప్పులను కోల్పోయియున్నట్లయితే నీవు మారు

మనస్సు పొంది ఆ మొదటి క్రియలను చేయుము. క్రైస్తవుడవైన మొదట్లో నీకున్న ప్రేమ, ప్రోత్సాహము, ఆసక్తి యివన్నీ మరల సంపాదించుకొనుము. మొదట్లో నీ జీవితాన్ని ప్రభువుకు సమర్పించి నప్పుడు ఎట్లు ప్రవర్తించావు? అప్పుడు బైబిలును ఎంత తీవ్రంగా చదివేవాడవో ఇప్పుడుకూడా అట్లు చేయుము. అప్పుడు ప్రార్థించిన యట్లే ఇప్పుడు ప్రార్థన చేయుము. అప్పుడు సంఘారాధనలకు వెళ్ళి నట్లే ఇప్పుడును విడువక ఆరాధనకు వెళ్లుము. ప్రభువు పనికి నిస్వార్థ ముగా కానుకలిచ్చినట్లే ఇప్పుడును ఇచ్చుటకు మొదలుపెట్టుము. ప్రభువు యెడల, ఆయన పనియెడల మొదట్లో నీకున్న ప్రేమను, సంతోషాన్ని తిరిగి తెచ్చుకో. ప్రభువు నిన్ను తిరిగి ప్రేమిస్తాడు.

నీతికొరకు ఆకలిదప్పులు కలిగియుండుట అంత సులభమైన పని కాదు. అపవాది వాని అస్త్రము లన్నిటిని నీమీద ప్రయోగిస్తాడు. అయితే అపవాదిని ఎదిరించి దేవుని వాక్యాన్ని చేబూని ముందుకు పోవాలి. "నీ ఆజ్ఞ లన్నియు న్యాయములు. నీ వాక్యమును గూర్చి నా నాలుక పాడును" అని దావీదు మహారాజు చెప్పాడు (కీర్త 119:172). ఈ లోకాశలతో మన హృదయం నిండియుంటే ఆత్మీయా కలి కుంటుబడతాది. "కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి. అప్పుడవన్నియు మీకనుగ్రహింప బడునని" యేసుప్రభువు చెప్పారు.

నీతికొరకు ఆకలి దప్పులు గలవారు తృప్తి పరచబడుదురని ఆయన వాగ్దానము చేసారు. ఎవడైనను దేవుని చిత్తము చొప్పున చేయ నిశ్చయించుకొనిన యెడల అతడు క్రీస్తుబోధను తెలిసికొనును (యోహాను 7 : 17). "మీరు నా వాక్యమునందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్ములను స్వతంత్రులనుగా చేయునని" ఆయన చెప్పారు

(యోహాను 8:31, 32). అలనాడు బెరెయలోని ప్రజలు ఏమి చేసారో మనమును అట్లు చేయాలి. వారు "ఆసక్తితో వాక్యమును అంగీకరించి పౌలును సీలయును చెప్పిన సంగతులు అలాగున్నవో లేదో అని ప్రతిదినము లేఖనములు పరిశోధించుచు వచ్చిరి" (అపొ. కా. 17 : 11). దేవుని వాక్యాన్ని గూర్చి ఈ లోకంలో ఆకలిదప్పులు గలవారికి పరలోకంలో "ఆకలియైనను దాహమైనను ఉండదు. సూర్యుని యెండయైనను ఏ వడగాలి యైనను వారికి తగులదు. ఏలయనగా సింహాసన మధ్యమందుండు గొఱ్ఱెపిల్ల వారికి కాపరియై జీవజలముల బుగ్గ యొద్దకు వారిని నడిపించును, దేవుడే వారికన్నుల నుండి ప్రతి బాష్పబిందువును తుడిచివేయును" (ప్రకటన 7:16,17). నీతినిమిత్తం ఆకలి దప్పులు గలవారు ధన్యులు వారు తృప్తి పరచబడుదురు ?

—జాషువా గూటం.

—o—

## సార్వజనిక ఆజ్ఞ

### ( The Universal Command )

అపొ. పౌలు ద్వారా పరిశుద్ధాత్ముడు ఇట్లు పలికెను : "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ. కా. 17 : 30). మానవులు మారుమనస్సు పొందవలెనను ఆజ్ఞతో యోహాను తన ప్రచార కార్యక్రమమును ప్రారంభించెను (మత్తయి 3 : 2). మారుమనస్సు పొందుడి యని మానవులను ఆజ్ఞాపిస్తూ యేసు తన సువార్త కార్యక్రమమును భూమిపై ఆరంభించెను (మత్తయి 4 : 17). మానవులు మారుమనస్సు నొందక పోతే నశిస్తారని ఆయన చెప్పెను (లూకా 13 : 3).

మన క్రియలలో మారుమనస్సు నిరూపింపబడతాది. మానవులు దేవుని తట్టు తిరిగి మారుమనస్సుకు తగిన ఫలములు ఫలించాలని

యోహాను ప్రకటించెను (మత్తయి 3 : 8). ఒకడు క్రైస్తవుడు కావాలంటే మారుమనస్సు బొంది బాప్తిస్మము పొందాలి (అపో. కా. 2 : 38). క్రైస్తవ జీవితం జీవించాలంటే అందులో మారుమనస్సు ప్రతినిత్యము ఉండాలి (రోమా 2 : 4).

క్రైస్తవులగుటకు మనం సంశయించుచున్నామా ? క్రైస్తవ జీవితము జీవించుటకు సంశయించుచున్నామా ? "కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు" ( 2 పేతురు 3 : 9).

నేను మారుమనస్సు పొందుటకుగాను యేసు చనిపోయెను (లూకా 24 : 46-47). ఆసియాలోని 7 సంఘములకు ప్రభువు వర్తమానము పంపినప్పుడు, అందులో అయిదింటిని మారుమనస్సు పొందవలెనని ఆజ్ఞాపించెను. ఈ సంగతి ప్రతి క్రీస్తుసంఘ సభ్యుడు గుర్తించవలెను (ప్రక 2 : 5; 2 : 16; 3 : 21; 3 : 3; 3 : 19). దైవ చిత్తానుసారమైన దుఃఖమువలన నీ జీవిత విధానమును దేవుని తట్టు మరల్చుకొనుటయే మారుమనస్సు. యిది సార్వజనిక ఆజ్ఞ.

— J. C. బెయిలీ.

— o —

## పరిశుద్ధాత్మ అనగా దేవుని ఆత్మ

(గత సంచిక తరువాయి)

### క్రొత్త నిబంధన యందు పరిశుద్ధాత్మ

పరిశుద్ధాత్మను గూర్చి క్రొత్త నిబంధన యందు రెండు వందల అరువది నాలుగు లేఖనములు గలవు.

ఈ క్రింది లేఖనముల యందు పరిశుద్ధాత్మ రకరకాల పేర్లతో వర్ణించబడెను.

రోమా 8 : 13 ఆత్మ

రోమా 8 : 14 దేవుని ఆత్మ

రోమా 8 : 9 క్రీస్తు ఆత్మ

గలతి 4 : 16 కుమారుని ఆత్మ

మత్తయి 10 : 20 తండ్రి ఆత్మ

యోహాను 14 : 16 ఆదరణ కర్త; సత్యస్వరూపి యగు ఆత్మ.

క్రొత్తనిబంధన యందు ఆరు సందర్భములుగా పరిశుద్ధాత్మను పొందిరి.

(1) లూకా 1 : 41 :- ఎలీసబెత్తు పరిశుద్ధాత్మతో నిండుకొనెను

(2) మత్తయి 1 : 18 :- యేసుక్రీస్తు జననవిధ మెట్లనగా ఆయన తల్లియైన మరియ యోసేపునకు ప్రధానము చేయబడిన తరువాత వారేకము కాక మునుపు ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భవతిగా ఉండెను.

(3) లూకా 1 : 16 :- బాప్తిస్మమిచ్చు యోహాను తల్లి గర్భమున పుట్టినది మొదలుకొని పరిశుద్ధాతతో నిండుకొనెను.

(4) మత్తయి 3:16 :- యేసు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్ళలో నుండి ఒడ్డునకు వచ్చెను. ఇదిగో ఆకాశము తెరవబడెను. దేవుని ఆత్మ పావురమువలె దిగి తన మీదికి వచ్చుట చూచెను.

(5) యోహాను 15 : 25-27; 14 : 14-17; 16 : 13; ఈ లేఖనము లందు యేసు తన 12 మంది అపొస్తలులకు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చిన వాగ్దానము చేసెను.

(6) అపొ. కా. 6 : 6; 8 : 17, 18 - అపొస్తలులు చేతులుంచగా కొందరు పరిశుద్ధాత్మను పొందిరి.

అపొస్తలుల పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి తెలుసుకొనే ముందు మరికొన్ని విషయములు తెలిసికొనవలసినవి గలవు. మానవునికి దేవుని బయలు పర్చుటలో పరిశుద్ధాత్మకు సంబంధము కలదని క్రొత్త నిబంధన లేఖనములు చెప్పుచున్నవి. "అయితే ఆయన అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినపుడు మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును. ఆయన తనంతట తానే యేమియు బోధింపక వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును" (యోహా 6 : 18). దేవుని చిత్తమును తెలిసికొనుటకు మానవుడు పూర్తిగా దేవుని వాక్యముపై ఆధారపడి యున్నాడు. తండ్రియైన దేవుని గొప్ప ప్రేమ, ఆయన కృప చిత్తము ఆత్మ ద్వారా మానవునికి తెలియజేయబడాలి. ఒక మనుష్యుని సంగతులు అతనిలోనున్న మనుష్యాత్మకే గాని మనుష్యులలో మరి ఎవరికి తెలియును? ఆలాగే దేవుని సంగతులు దేవుని ఆత్మకేగాని మరి యెవరికిని తెలియవు (1 కొరి 2 : 11). అందువలన అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుటచేత ఆది సంఘమునందు గల విశ్వాసులకు పరిశుద్ధాత్మ ఉపయోగ పడెను.

## యేసుచేసిన వాగ్దానము

బాప్తిస్మమిచ్చు యోహాను ప్రభువైన యేసుక్రీస్తు పరిశుద్ధాత్మలోను అగ్నిలోను బాప్తిస్మ మిచ్చునని ముందుగానే చెప్పెను (మత్తయి 3 : 11; మార్కు 1 : 8; లూకా 3 : 16). యేసు ఆరోహణమునకు ముందు అపొస్తలులకు వాగ్దానము చేసెను. యోహాను నీళ్ళలో బాప్తిస్మ మిచ్చెను గాని కొద్ది దినములలోగ మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరనెను (అపొ.కా. 1:5). నేను తండ్రిని వేడుకొందును. మీయొద్ద ఎల్లపుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణ కర్తను అనగా సత్యస్వరూపి యగు ఆత్మను మీ కనుగ్రి

హించును (యోహాను 14 : 16). ఈ విషయము పాతనిబంధన యందు ప్రవచింపబడెను. క్రొత్త నిబంధన యందు పరిశుద్ధాత్మ బాప్తిస్మము వాగ్దానము చేయబడెను గాని అది ఆజ్ఞ మాత్రము గాదు. అందు వలన యే మనుష్యుడైనను మరొకని పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపింపరాదు. క్రొత్తనిబంధన యందు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుట రెండే రెండు దృష్టాంతములు చెప్పబడెను. (1) "పెంతెకోస్తు పండుగ దినము వచ్చినపుడు అందరూ ఒకచోట కూడియుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొక ధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా వారు కూర్చుండిన యిల్లంతయు నిండెను. మరియు అగ్నిజ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్లుగా వారికి కనబడి వారిలో ఒక్కొక్కనిమీద వ్రాలగ, అందరూ పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించిన కొలది అన్యభాషలతో మాట్లాడ సాగిరి" (అపో.కా. 2:1-4). అయితే రెండవ దానిని ప్రస్తావించకముందు అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఎట్లు పొందిరి అనునది మనము లేఖనములద్వారా గమనించుట మంచిది.

ఇదివరకు మనము తెలిసికొనిన రీతిగా ప్రభువైన క్రీస్తు అపొస్తలులకు పరిశుద్ధాత్మను గూర్చి చేసిన వాగ్దానము పొందుటకు అపొస్తలులను యెరూషలేము వెళ్ళవలెనని యేసు వారికి తెలియజేసెను. అపొస్తలులు పరిశుద్ధాత్మ బాపిస్మము ఎట్లు పొందిరో అ॥కార్యములు 2 : 1-4 వరకు లేఖనములు చదివి ఇంత క్రితమే తెలిసికొంటిమి. అయితే వారు తండ్రి కుమార పరిశుద్ధాత్మలోనికి పొందినట్లు ఈ లేఖనములలో చెప్పబడలేదు. పాపక్షమాపణ నిమిత్తము పరిశుద్ధాత్మను పొందినట్లు చెప్పబడలేదు. వారందరూ పరిశుద్ధాత్మతో నిండినవారై ఆత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించినకొలది అన్యభాషలతో (ఇతర భాషలతో) మాట్లాడసాగిరి.

అపొస్తలులు అన్యభాషలు మాట్లాడుచున్నపుడు ఈ భాషలు అచ్చట ప్రజలు అర్థము చేసికొనిరా? "ఈ శబ్దము కలుగగా జనులు గుంపులు గుంపులుగా కూడివచ్చి ప్రతి మనుష్యుడు తన తన స్వభాషతో వారు (అపొస్తలులు) మాట్లాడుట విని కలవరపడిరి" (అపొ.కా. 2 : 16).

అపొస్తలులు భాషలు మాట్లాడుట ఆ ప్రజలు విని కలవరపడు అవసరత ఎందుకు? ఆ ప్రజలయొక్క స్వభాష అపొస్తలులు మాట్లాడిరి గనుక. ఉదా :-అరబ్బు దేశస్థుడు అరబ్బీ మాట్లాడును. వారికి తెలుగు రాదు, అయితే ఆ దేశస్థుడు తెలుగు మాట్లాడు చున్నపుడు తెలుగువారు విని ఏమనుకుంటారు? అరబీయుడు తెలుగు మాట్లాడు చున్నపుడు ఆశ్చర్యము కలుగదా? అటులనే అపొస్తలులు పరిశుద్ధాత్మ శక్తివలన వారు అక్కడున్న వారి భాషలు మాట్లాడుచుండుట వలన వారును విభ్రాంతినొంది ఆశ్చర్యపడి "ఇదిగో మాటలాడుచున్న వీరందరూ గలతీయులు కారా! మనలో ప్రతివాడు తాను పుట్టిన దేశపు భాషతో వీరు (అపొస్తలులు) మాట్లాడుట మనము వినుచున్నామే. ఇదేమి!". అపొస్తలులు అక్కడున్న ప్రజలయొక్క భాషలే మాట్లాడిరి. ఆ భాషలు వారికి అర్థమగుచుండెను. దేవుని గొప్ప సంగతులు అపొస్తలులు అక్కడున్నవారి భాషలలో తెలియజేయుచుండిరి. దేవుని నిత్య సువార్త అక్కడ ప్రకటింపబడెను. జనులు ఆ సువార్త విని మారుమనస్సు బాప్తిస్మము పొంది దేవుని రాజ్య నివాసులుగా చేయబడిరి. ఆ దినమందు ఇంచుమించు 3000 మంది బాప్తిస్మము పొందిరి (అ.కార్య. 2 : 41).

పెంతెకోస్తు పండుగ యెరూషలేములోనే జరగాలి. ఆ పండుగను ఆచరించుటకు ఆకాశముక్రింద నున్న యూదు లందరు రావాలి. వారందరు ఒకే భాష మాట్లాడువారు కాదు (అ.కార్య. 2 : 5; 9).

ఏది ఏమైననూ లోకమునందు గల ప్రజలందరు దేవుని సువార్త విను టకు ఇది గొప్ప సమయముగా దేవుని ఉద్దేశమేమో? సువార్త ప్రపంచమంతట ప్రకటించ బడుటకు ఈ పండుగ దినమున పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుటద్వారా అపొస్తలులు వివిధ భాషలతో దేవుని గొప్ప కార్యములను ప్రకటించుట దైవ ఉద్దేశమేమో? మొత్తం ప్రపంచములోని జనులందరూ మానవుని గూర్చిన దైవ సంకల్పము వినునట్లు ఈ సమయము అనుకూలమాయెనని మనం చెప్పవచ్చు. మరొక వింత ఏమంటే ఆనాడు పాతనిబంధనలో ప్రవక్తయైన యోవేలు 2 : 28 లో ప్రవచించిన ప్రవచనము ఈ పెంతెకోస్తు పండుగనాడే నెరవేర్చబడుటకు దైవనియమమేమో! అందువలన భవిష్యత్తులో జరగబోవు సంగతులను గూర్చి దేవుని మూలముగా పలికిన యోవేలు ప్రవక్త యొక్క ప్రవచనము సత్యమే అనుటకు ఋజువు పెంతెకోస్తు పండుగ.

అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుటకు ముఖ్య కారణము ఏమిటో, లేఖనములద్వారా అనేక సంగతులు తెలిసి కొంటిమి. వారు మాట్లాడుచున్న మాటలు దేవుని వాక్యమేనని ప్రజలను ఒప్పించునట్లు వారికివ్వబడిన అద్భుతమైన శక్తిని ఉపయో గించినట్లు లేఖనములు చదివితిమి (మార్కు **16:20**, అపొ. కార్యములు **2:44**, హెబ్రీ **2:4**).

అపొ. కార్యములు **10: 44-46** నందు గల లేఖనములను మనము పరిశీలించినట్లయితే కొర్నేలి గృహమునందు గల అన్యులకు క్రీస్తును గూర్చిన సువార్తను బోధించుచున్న సమయమున పేతురు బోధ విన్న వారందరిమీదికి పరిశుద్ధాత్మ దిగెను. వారును భాషలతో మాట్లాడిరి. ఆ భాషలు అక్కడున్న వారికి అర్థమైనవా? అవును, వారు మాట్లాడు భాషలతో దేవునిని ఘనపర్చుట వారు వినిరి అని స్పష్ట

ముగా చెప్పబడెను. యింతకన్న ఋజువు ఇంకేమి కావాలి? పేతు రైతే, మనవలె పరిశుద్ధాత్మను పొందిన వీరు అని చెప్పుచుండెను.

కొర్నేలి యింటివద్ద అన్యులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి. ఈ సంఘటనకు గల ముఖ్య కారణము అన్యులను కూడ దేవుడు తన రాజ్యములోనికి అంగీకరించుచున్నాడను భావము పేతురు, యూదులు గుర్తించునట్లు ఇది జరిగెను. దేవుడు నిజముగా పక్షపాతి కాడను విష యము గ్రహించునట్లు జరిగెను. పేతురు నోరు తెరచి ఇట్లనెను: "దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించి యున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొను వానిని ఆయన అంగీకరించును" (అపొ.కా. 10:34-36).

అందువలన యోవేలు గ్రంథమునందు వాగ్దానము చేయబడిన పరిశుద్ధాత్మ బాప్తిస్మము నెరవేరెను (అ. కార్య. 2 : 15-16). పరి శుద్ధాత్మలోనికి వారికి బాప్తిస్మ మిచ్చినవాడు యేసుక్రీస్తే. ఆయన తప్ప ఏ మానవునికి ఇట్టి బాప్తిస్మ మిచ్చుటకు అధికారము లేదు.

అపొస్తలుల యందును, కొర్నేలి ఇంటి వద్దను జరిగిన ఈ సంఘటన బైబిలు లేఖనములయందు మరెచ్చటను జరగలేదు. కార ణము ప్రస్తుతము ఒకే బాప్తిస్మము అమలులో నున్నది. ఇది నీటి బాప్తిస్మము. బాప్తిస్మము ఒక్కటే (ఎఫెసీ 4:5, మార్కు 16:16, 1 పేతురు 3:21). ఈ లేఖనములు రక్షణ కొరకు నీటి బాప్తిస్మము అవసరమని తెలియజేయుచున్నవి. అనేక ఉదాహరణలు అపొస్తలుల కార్యమునందు చూడగలము. గనుక రక్షింపబడుటకు పరిశుద్ధాత్మ బాప్తిస్మము అవసరము లేదనుటకు అపొ.కార్యములు స్థిరమైన వర్త మానముగా నున్నది. (సశేషం)

—M. ఆల్ ఫ్రెడ్, రామచంద్రపురం

-: o :-

# క్రీస్తు యొక్క ఆకర్షణ శక్తి

## ( The Drawing Power of Christ )

యేసుక్రీస్తు అనే వ్యక్తి ఎన్నడు ఉద్భవించలేదని కొందరు విమర్శకులు ఈ లోకాన్ని నమ్మించబోయారు. ఆయన కేవలం పౌరాణికంగా కల్పించబడినవాడే యని వారు చెప్ప ప్రయత్నించారు. అయితే క్రీస్తుయొక్క ఉనికిని యూదుల 'తల్మాదు' గ్రంథముసహితము ఒప్పుకొనుచున్నది. యూదుల చరిత్రకారుడైన జోసిఫస్ కూడ ఆయనను గూర్చి వ్రాసాడు. రోమీయుల చరిత్రకారుడైన టేసిటస్ యేసును గూర్చి చెబుతు పిలాతు ఆయనకు తీర్పు తీర్చిన సందర్భాన్ని గూర్చి కూడ వ్రాసాడు.

యేసు 'కల్పించబడిన' వ్యక్తి కాదు. ఆయన నిజంగా ఉన్నవాడే. ఆయన బెత్లెహేములో జన్మించి నజరేతులో పెరిగెను. ఆయన 33½ సంవత్సరాలు మాత్రమే భూమిపై జీవించాడు. సరిగదా ఈ భూమిపై ఒక మారుమూలలో జీవించినట్లు జీవించాడు. అయితే చరిత్రకు ఆధారభూతునిగ ఆయన జీవితం, ఆయన బోధలు అన్ని కాలాలలోనికి వ్యాపించాయి, అన్ని స్థలాలలోనికి అందరి మానవ హృదయాల్లోనికి వ్యాపించాయి.

మానవజాతిపై ఏ మానవునికి ఎన్నడు లేనంత ప్రభావము క్రీస్తుకున్నది. అరవైతరాలు గతించినా వందలాది కోట్ల ప్రజలు ఆయన శిష్యులమని, క్రైస్తవులమని చెప్పుకొనుటకు ఆశపడుచున్నారు. బైబిలు అంతటిలో గమనించదగిన ఒక వాక్యము యోహాను 12:32లో కనబడుచున్నది. "నేను భూమిమీదనుండి పైకెత్తబడిన యెడల అందరిని నా యొద్దకు ఆకర్షించుకొందునని" ఆయన చెప్పెను. యేసు ఈ మాటలు చెప్పగానే అది జరుగుట ప్రారంభించెను. ఆయన సిలువమీద

పైకెత్తబడెను. ఆయన సమాధిలో నుండి పైకెత్తబడెను; అటుపిమ్మట ఆయన పరలోకములోనికి ఎత్తబడెను.

శతాబ్దముల తరబడి మానవునికున్న అనుభవమును బట్టి క్రీస్తు రోమీయుల సిలువపై మరణించగానే క్రైస్తవ ఉద్యమము నాశనమై యుండాలి. దాని నాయకుడు వెడలిపోయినందువలన అది గడ్డియూరపు ముల్లు వలె క్రిందికి దిగజారిపోయి యుండాలి. అయితే శతాబ్దాలు గడిచేకొలది అది మరింత ప్రజ్వరిల్లు చున్నది. క్రీస్తుయొక్క ఆకర్షణ శక్తి క్షీణించిపోయి మృతమైనదగుటకు బదులు అది మరింత గొప్పగా పెరిగిపోయింది. ఆయన జీవితకాలంలో ఆయన యొద్దకు ఆకర్షింపబడిన వారిని గమనించుము. మగ్దలేని మరియ, జక్కయ్య, యూదా, మత్తయి, పేతురు, యాకోబు, యోహాను మొదలగువారు. తమ కుటుంబము లను, వృత్తితో సహా ఆయన కొరకు కోల్పోవునంత మట్టుకు ఆయన ప్రజలను తన యొద్దకు ఆకర్షించుకొన్నాడు. మరణించిన తరువాత సయితము ఆయన ప్రజలను ఆకర్షిస్తూనే యున్నాడు. రోమా శతాధిపతియైన కొర్నేలి, ఫిలిప్పుయి చెరసాల అధిపతి, ఐతియోపీయ నపుంసకుడు మొదలగువారు ఆ జాబితాలోనివారే.

19 శతాబ్దా లయిపోయిన తరువాత కూడ క్రీస్తు ఇంకా ప్రజలను ఆకర్షిస్తూనే యున్నాడు. ఆయన యుగ యుగములకు ఆకర్షణీయుడే! విచారమేమంటే, అనేకులు క్రీస్తుయొక్క ఆకర్షణశక్తిని ఎదురొడుచున్నారు. వారు యేసే క్రీస్తని మనుష్యుల యెదుట ఒప్పుకొనుట లేదు. వారాయన యందు విశ్వాసముంచవచ్చును. రహస్యంగా ఆయనను ఒప్పుకొనుచుండ వచ్చును. అయితే వారి దైనందిన జీవితాల్లో దీనిని బహిరంగముగా తెలియపర్చుటకు వెనుకాడుచున్నారు. ఆయనతో లెక్కింపబడుటకు వారికి ధైర్యము లేకపోయింది.

క్రీస్తుయొక్క ఈ మాటలను నీవు విన్నావా? "ప్రయాస పడి

భారము మోసికొనుచున్న సమస్త జనులారా నాయొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను దీనమనసుగల వాడను గనుక మీమీద నా కాడి ఎత్తుకొని నాయొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును. ఏలయనగా నాకాడి సుళువుగాను, నా భారము తేలికగాను వున్నవి" (మత్త 11:28-30). ఆయన పిలుపును నీవు విన్నావా? మనుష్యుల యెదుట ఆయనను నీవు ఒప్పుకొన్నావా? నీ పాపముల విషయమై మారుమనస్సు పొందావా? బాప్తిస్మములో ప్రభువుతో నీవు ఏకమయ్యావా?

—రోయ్ బీస్లే.

—o—

## సంతోషించువారితో సంతోషించుడి

## ("Rejoice with Them That Rejoice")

"సంతోషించువారితో సంతోషించుడి; ఏడ్చువారితో ఏడువుడి" యని అపో. పౌలు చెప్పాడు (రోమా 12:15). "అయితే శరీరములో వివాదము లేక అవయవములు ఒకదానినొకటి యేకముగా పరామర్శించులాగున దేవుడు తక్కువదానికే యెక్కువ ఘనత కలుగజేసి శరీరమును అమర్చి యున్నాడు. కాగా ఒక అవయవము శ్రమపడు నప్పుడు అవయవము లన్నియు దానితో శ్రమ పడును; ఒక అవయవము ఘనత పొందునప్పుడు అవయవము లన్నియు దానితో సంతోషించును. అటువలె మీరు క్రీస్తుయొక్క శరీరమై యుండి వేరువేరుగా అవయవములై యున్నారు" (1 కొరింథీ 12:25-27).

అయితే అసూయగలవాడు సంతోషించువారితో సంతోషించుట అసాధ్యము. అందువలన అసూయగలవాడెవడును క్రీస్తు రాజ్యములో నమ్మకమైన పౌరుడు కాడు. తన పొరుగువానిని గూర్చి మంచి వినగానే బాధపడువాడు, అతని గూర్చి చెడు వినగానే సంతోషిస్తాడు.

అసూయతో కుళ్ళుకొనువారు యితరులు కూడ తామున్న స్థాయికి దిగజారిపోతే సంతోషిస్తారని బెంజమిన్ ఫ్రాంక్లిన్ చెప్పాడు.

సాధారణంగా అసూయపరులే అసూయ వలన నాశనమవుతారు. చిమ్మెట బట్టలను కొరికి వేయునట్లు అసూయ గలవారిని అది కొరికి వేయును. "సాత్వికమైన మనస్సు శరీరమునకు జీవము, మత్సరము ఎముకలకు కుళ్లు" (సామె 14 : 30).

**—G. F.** రెయిన్స్.

— o —

## మణిపూర్‌లో జరుగుచున్న సువార్త పని

భారత ఈశాన్య సరిహద్దులలో యున్న ఒక చిన్న రాష్ట్రము మణిపూర్. ఈ రాష్ట్రములో ఇంచుమించు 20 క్రీస్తు సంఘములున్నాయి. అవన్నీ స్వయంపోషక సంఘాలే. కొన్ని స్థానిక సంఘాలలో 200 లకు పైగా సభ్యులున్నారు. చురచంద్‌పూర్‌లో యున్న సంఘము బహుశ భారత్‌లో యున్న క్రీస్తు సంఘాలన్నిటిలోను పెద్దది. ప్రతి ఆదివారం మూడు వందలకు పైగా సభ్యులు ఆరాధనకు కూడుకొందురు. అలాగే న్యూలమ్‌కాలోయున్న సంఘము కూడ పెద్దదే. వారు భవిష్యత్తులో ఒక బైబిలు కాలేజీ నిర్మించి నిర్వహించుటకు గాను స్థలము వగయిరా సేకరించి సన్నద్ధులగుచున్నారు.

మణిపూర్ రాష్ట్రము యొక్క ముఖ్యపట్టణము ఇంఫాల్. ఈ పట్టణములో 4 స్థానిక సంఘాలున్నాయి. బైబిల్ ఎకాడమీ ఆవరణలో కూడుకొను సంఘము సంఖ్యలో చిన్నదైనా ఇచ్చటలో అతి పెద్దది. ఇంఫాల్‌లో **Bro.** శ్యాంసలామ్‌గారు, వారి కుటుంబము క్రీస్తు కొరకు బలమైన పనిముట్లుగా వాడబడుచున్నారు. శ్యాంసలామ్‌గారు బైబిల్ అకాడమీ అనే ఇంగ్లీషు మీడియం స్కూల్ స్థాపించి నడుపుచున్నారు. అందులో **LKG** నుండి 12వ తరగతి వరకు

విద్యాబోధన జరుగుచున్నది. 1700 మంది విద్యార్థులు, 60 మంది టీచర్లు బైబిల్ అకాడమీలో పని చేయుచున్నారు. ఆ స్కూల్ యొక్క ప్రిన్సిపాల్ శ్యాంసలామ్‌గారే.

మణిపూర్‌లో యున్న క్రీస్తు సంఘముల దాతృత్వము వలన కలకత్తాలో ఒక స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ నిర్వహించబడుచున్నది. దీనిలో భారత ఈశాన్య రాష్ట్రములనుండి, నేపాల్, బర్మా దేశముల నుండి వచ్చిన విద్యార్థులు బైబిలు ట్రయినింగ్ పొందుచున్నారు. మణిపూర్‌లో యున్న సంఘములు నేపాల్ దేశానికి ఒక మిషనరీని కూడ పంపి, ఆ దేశములో సువార్తసేవ చేయుచున్నారు. భారత దేశపు క్రీస్తు సంఘములనుండి పొరుగు దేశాలకు మిషనెరీని పంపిన ఘనత మణిపూర్‌లో యున్న క్రీస్తు సంఘాలకే దక్కినది. ఆయా స్థానిక క్రీస్తు సంఘ సభ్యులు ప్రభువు కొరకు ధారాళముగా ఇచ్చుట వలన మణిపూర్‌లో సంఘములు అన్నిరంగాలలోను స్వయం పోషకమైనవే. ఆ రాష్ట్రములో విదేశీ సహోదరుల ప్రమేయముగాని, ఆర్థిక సహాయముగాని ఇప్పటివరకు లేదు. అది అలాగే కొనసాగాలని మణిపూర్ సోదరులయొక్క కాంక్ష. మణిపూర్ నుండి కొందరు సహోదరులు బర్మా దేశములోనికి వెళ్ళి సువార్త ప్రకటించుచున్నారు. తత్ఫలితముగా బర్మాలో 6 లేక 7 స్థానిక సంఘము లున్నాయి. భారత ఈశాన్య రాష్ట్రములలో జరుగుచున్న క్రీస్తు పని మరింత బలపడునట్లు ప్రార్థించుదాం.

— o —

## సంక్షిప్త వార్తలు

1994 మే నెల 2వ తేదీ నుండి 12వ తేదీ వరకు సోదరులు జాషువా గూటం గారు వారి కుమార్లు సామ్యూల్ రోనీ, జాషువా రాబిన్‌లతో మణిపూర్ రాష్ట్రమును సందర్శించి, పలుచోట్ల సువార్త

కూటములు జరిపించిరి. జాషువాగారు చుర్ చంద్ పూర్, న్యూలమ్కా, ఇంఫాల్, లామ్ ఫెన్ లలో వాక్యమును ప్రకటించిరి. జాషువాగారు ఇంగ్లీషులో మాట్లాడుచుండగా వారి వర్తమానములు పైటే, మణిపూరి భాషలలోనికి తర్జుమా చేయబడెను. ఇంఫాల్ లో జరిగిన రెండు రోజుల సువార్త కూటములలో ఇద్దరు యౌవనస్థులు బాప్తీస్మము పొందిరి.

మే 6వ తేదీ శుక్రవారం ఒరిస్సాలోని బరంపురం క్రీస్తు సంఘ ఆవరణలో ఒరిస్సా, శ్రీకాకుళం ప్రాంతముల్ల సువార్తికుల సదస్సు జరిగెను. ఆ సదస్సుకు ఇంచుమించు 45 మంది సువార్తికులు హాజరై "క్రీస్తు సంఘమును గుర్తించుట యెట్లు?" అను అంశమును చర్చించిరి. బరంపురంలోను పరిసర ప్రాంతములలోను **Bro. Y.** తాతారావ్ గారు క్రీస్తు కొరకు మంచి పని చేయుచున్నారు.

* * *

మే నెల సువార్తికుల సదస్సు 25వ తేదీన తొత్తరమూడిలో (తూ॥గో॥ జిల్లా) క్షేమాభివృద్ధికరంగా జరిగెను. క్రీస్తు శ్రమలలోను ఆదరణలోను పాలివారై ఆయన జ్ఞానము యొక్క సువాసనను వెదజల్లుచు, సామర్థ్యము కలిగిన పనివారిగ ఆయన రాజ్యములో పని చేయుచున్న సువార్తికుల సమక్షంలో "సహోదరులు ఏక మనస్సు ఏక తాత్పర్యము కలిగియుండుట ఎట్లు?" అను అంశము చర్చింపబడెను.

ఉదయ కాలపు సమావేశములో సోదరులు జి. షడ్రక్ గారు, ములపర్తి సుకేశ్ రాజాగారు, పి. ప్రకాశంగారు, వి. చిన్నయ్యగారు చర్చలో పాల్గొనిరి. మధ్యాహ్న సమావేశములో సోదరులు బి. ప్రసాదరావుగారు, పాల్ గూటంగారు, బి. యోహానుగారు, **M.** ఆల్ ఫ్రెడ్ గారు మరియు జాషువా గూటంగారు చక్కని వర్తమానములను అందించిరి.

సాయంకాలం సువార్త దండయాత్ర దిగ్విజయంగా జరిగెను. వేలాది కరపత్రములు పంచిపెట్టబడెను. అనేకులు దేవుని వర్తమానమును వినిరి. సోదరులు డి. సామ్యూల్‌గారు మంచి ఏర్పాట్లు చేసి సదస్సును విజయవంతముగ నడిపించిరి. ఒకే పునాది, ఒకే గ్రంథము, ఒకే శరీరము, ఒకే ఆత్మ, ఒకే నిరీక్షణ, ఒకే ప్రభువు, ఒకే విశ్వాసము, ఒకే బాప్తిస్మము, ఒకే తండ్రిని కలిగియున్న సహోదరులు స్వల్ప కారణముల వలన వేరై యుండుట ఆశ్చర్యము! కొరింథులోనున్న సంఘమునకు పౌలు పత్రికలు వ్రాయుచు ఐక్యత యొక్క అవసరమును ఔన్నత్యమును గూర్చి అనేక సంగతులను చక్కగా వివరించెను. "మీరందరు ఏక భావముతో మాటలాడ వలెననియు, మీలో కక్షలులేక యేక మనస్సుతోను ఏక తాత్పర్యముతోను సన్నద్ధులై యుండవలెననియు మిమ్మును వేడుకొనుచున్నాను" (1 కొరింథీ 1 : 10).

"ఏక మనస్సును సాధించుట ఎట్లు?" యిది మన అంశము. క్రీస్తు, అపొస్తలులు తమ ప్రార్థనలలో ఏకత్వమును గూర్చి పదేపదే ప్రస్తావించిన విషయం పరిశీలిస్తే క్రైస్తవులను దేవుని రాజ్యంలో పటిష్టమైన స్థితిలో ఉంచగలిగినది యేక మనస్సు మాత్రమే. యేక మనస్సు ఎక్కడైతే లోపించినదో అక్కడ క్రీస్తు శరీరము విభజింపబడుచున్నది. యిది దుష్పరిణామము. ఐక్యతకు అవరోధం కలిగించే విషయాలను క్రైస్తవులు అధిగమించాలి. అసూయ, కులం, ధనాపేక్ష, స్వార్థం ఇవేమీ ఐక్యతకు అవరోధం కలిగించకుండ క్రైస్తవుడు జాగ్రత్త పడాలి. "మీరు ఏకమనస్కులగునట్లుగా ఏక ప్రేమ కలిగి, యేక భావము గలవారుగా ఉండి, ఒక్కదానియందే మనస్సుంచుచు నా సంతోషమును సంపూర్ణము చేయుడి" (ఫిలిప్పీ 2:2). యేకమనస్సును సహోదరులలో కలిగించుటకు ప్రేమకు శక్తి కలదు. వాక్యమందు నిలిచియుంటే, సత్యము మనలను స్వతంత్రులనుగా చేయును.

ఐక్యత లోపిస్తే దేవుని పని పాడవుతుంది. ఐక్యతలో విజయం,

శక్తి, క్షేమాభివృద్ధి, ఆదరణ మరియు ఘనత ఉన్నవి. ఐక్యత కలిగిన సంఘము గొప్ప పని చేయుగలుగుతుంది. ఐక్యతలో ఆశీర్వాదము కలదు. సత్యము ఐక్యతకు ఆధారము. అవగాహన ఐక్యతలో సహాకరించును. "ఆత్మ కలిగించు ఐక్యమును" కాపాడుకొనుమని పౌలు ఎఫెసీయులకు వ్రాసెను (ఎఫె 4:1). మన పోరాటంలో ఐక్యత లోపిస్తే శత్రువు సులభంగా మనపై విజయం సాధించగలడు. సోదరులు జాషువా గూటంగారు మణిపూర్‌లోని క్రీస్తు సంఘములు, వారి పని, ప్రేమ, ఐక్యత, దాతృత్వము మరియు క్రమశిక్షణను గూర్చి ఆసక్తికరమైన విషయములు చెబుతు మనముకూడ అట్టి యేకమనస్సును సాధించవలెనని తెలియజేసిరి. సోదరులు డి. ఇశ్రాయేలురాజుగారు వందన సమర్పణ చేయుగా సోదరులు ఇ. ప్రభాకర్ గారి ప్రార్థనతో సదస్సు ముగిసెను.

జూన్ 3, 4, 5, 6 తేదీలలో నిజామాబాద్‌లో జరుగు సువార్త కూటములలో పాల్గొనుటకుగాను సోదరులు ఇ.కె.వి. ప్రసాద్, M. ఆల్‌ఫ్రెడ్, జాషువా గూటంగార్లు ఈ పత్రిక ముద్రించు సరికి బయలుదేరి వెళ్ళిరి.

---

Regd. No. H/KD—45/KD R.O

From
SATYAVAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To ..............................................
..............................................
..............................................
..............................................